క్లుప్తంగా

రేపు భూ భారతిపై అవగాహన సదస్సు


తహసీల్దార్ పురుషోత్తం

దోమ: దోమ మండల కేంద్రంలో శుక్రవారం భూ భారతిపై అవగాహన నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి, ఉన్నత స్థాయి అధికారులు రానున్నారని, ఆయా గ్రామాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు రూరల్: తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ భానుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌతపూర్, కరన్‌కోట్, కోట బాసుపల్లి, జినుగుర్తి 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించేందుకు గురువారం ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11:30 నిమిషాల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

టాపర్లకు ఘన సన్మానం


ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

ధారూర్: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన ఇద్దరు విద్యార్థినులను బుధవారం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ అశోక్ పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్మానించారు. నవ్య ప్రణతి 992 మార్కులు, శ్రావ్య 962 సాధించి సత్తా చాటారు. ఇద్దరికి పంచాయతీ కార్యాలయ ఆవరణలో శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వెంకటేషం, పంచాయతీ కార్యదర్శి అంజానాయక్, కాంగ్రెస్ నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడంగల్: మండల పరిధిలోని హుస్సెన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన మొదటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు క్రాంతి కుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక


బీఆర్ఎస్‌లో చేరిన అనంత్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అనంత్‌రెడ్డి బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజు, మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మేక శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అనంత్‌రెడ్డి, బీఆర్ శేఖర్, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణానికి చెందిన యువతి ఇంద్రార్పితను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇంద్రార్పిత ఇంటికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు వెళ్లి ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై ఆమెను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, శ్రీకాంత్‌గౌడ్, ప్రశాంత్, వాసిమ్, రఘు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రోడ్డు పనులు

- నెల రోజులకే కంకర తేలిన రహదారి
- దుమ్ములేస్తున్న వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


దుమ్ము లేచి కంకర తేలిన సీసీ రోడ్డు

పరిగి: అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ. లక్షల్లో వెచ్చిస్తోంది. కానీ కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకంగా పనులు చేపడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇటీవల పరిగి పట్టణ కేంద్రంలో పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులు నిర్వహించారు. ఆ పనులు పూర్తి చేసి నెల రోజులు గడిచింది. ప్రస్తుతం ఆ రోడ్డు మొత్తం దుమ్ము లేచి కంకర తేలుతుంది. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే రహదారిపై కంకర తేలి దుమ్ములేస్తుందని పలువురు వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ కేంద్రంలోని 15వ వార్డులో బొడ్రాయి సమీపం నుంచి మార్కెట్ రోడ్డు వరకు సుమారు రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ నిర్మాణ సమయంలో కాలనీ వాసులు సదరు కాంట్రాక్టరుకు పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. అయినా కాంట్రాక్టర్ సీసీ రోడ్డును పూర్తిగా నాసిరకంగా చేపట్టారు. పనులు పూర్తయిన తరువాత కనీసం క్యూరింగ్ కూడా చేసిన పాపన పోలేదు. దీంతో కాలనీలోని ప్రజలు వారి ఇళ్ల ముందు సీసీ రోడ్డుపై నీరు పోశారు. అయినా సరిగా క్యూరింగ్ కాలేదు. సీసీ రోడ్డు వేసిన వారం రోజులకే రోడ్డుపై పెచ్చులు ఊడి దుమ్ము లేస్తుంది. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుపై వాహనాలు వెళ్తే మట్టిరోడ్డుపై వెళ్తున్నట్టుగా దుమ్ము లేస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి దుమ్ము రావడంతో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం వెచ్చించిన నిధులు పూర్తిగా దుర్వినియోగం అయ్యాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులు సక్రమంగా ఉపయోగపడలేదని వివరించారు. కాంట్రాక్టర్ పనులు నాసిరంగా నిర్వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజాధనం వృథా అయ్యాయని పేర్కొంటున్నారు. నాసిరకం పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు

కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్

దుద్యాల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని లగచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు పండించిన పంటను దళారులు ఎక్కువ ధర ఆశ చూపి తూకంలో మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. ఏ-గ్రేడ్ వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,320, బి-గ్రేడ్ వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300లకు కొనుగోలు చేస్తుందన్నారు. వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్య, వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు లక్ష్మయ్య, హన్మంతు, నాయకులు రామాంజనేయులు, నర్సిములు, రవి, కిష్టప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.


మోమిన్‌పేట: కొవ్వొత్తుల ప్రదర్శన

ఉగ్రవాద దాడి బాధాకరం


అనంతగిరి: ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు


తాండూరు రూరల్: మల్కాపూర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

- ఏబీవీపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం


కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

అనంతగిరి: పహల్గామ్ పర్యాటక కేంద్రాన్ని సందర్శిస్తున్న పర్యాటకులపై ఉగ్రవాద దాడి బాధాకరమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరాస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉగ్రవాద దుశ్చర్యను ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలందరూ కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. భారత్ అంటేనే భిన్నత్వంలో ఏకత్వమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కొంతమంది దేశప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్ర పన్నుతున్నారన్నారు. ఇలాంటి ఉగ్రవాద మూకలకు కేంద్రం సరైన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ తేజ, ఉపాధ్యక్షుడు దయాకర్, శివ, సంపత్, రామకృష్ణ, బాలకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ..

జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రమూకల చర్యలకు నిరసనగా వికారాబాద్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత శిశుమందిరం నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రమూకల ఆటకట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో సదానందరెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వడ్లనందు, శివరాజు, పోకల సతీష్, బుస్స శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, యాస్కి శిరీష, శ్రీలత, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండిస్తున్నాం

ఉగ్రమూకల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆర్‌టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ అన్నారు. బుధవారం రాత్రి ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చౌరాస్తలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఉగ్రదాడి పిరికి పంద చర్య: వీరేశం

యాలాల: శ్రీనగర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు పిరికిపంద చర్యనని, ఘటనకు కారణమైన వారిని గుర్తించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ యాలాల మండల అధ్యక్షుడు వీరేశం డిమాండ్ చేశారు. ఉగ్రదాడుల్లో హైదరాబాద్ వాసి మృతి చెందడం బాధాకరమన్నారు. దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.

కుల్కచర్ల: పర్యాటకులపై దాడి అమానుషమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ సంఘాలు, వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు బుధవారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

మోమిన్ పేట: హిందువులపై జరిపిన దాడిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మోమిన్‌పేట మండల బీజేపీ అధ్యక్షుడు ఆసి రెడ్డి అన్నారు. ఈ ఘటనకు నిరసనగా మండల కేంద్రంలోని బసవేశ్వర చౌక్ నుంచి పాత బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

హేయమైన చర్య..

ధారూర్: ఉగ్రవాదుల కాల్పులు రాక్షసచర్య అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

పరిగి: అమాయకులను పొట్టన పెట్టుకోవడం అత్యంత బాధకరమని మైనార్టీ నాయకుడు మీర్ మహోమ్మద్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదుల దాడిని కేంద్ర ప్రభుత్వం అన్ని కొణాల్లో దర్యాప్తు చేయాలని కోరారు.

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో యువకులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకి జై అంటు నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

తాండూరు: తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అసోషియేషన్ అధ్యక్షుడు కమల్ అత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ముస్లిం మతస్తులు హాజరై ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.



తాండూరు: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు

సెలవులొచ్చాయ్.. బడికి బైబై


దుద్యాల్: విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టు అందిస్తున్న ఎంఈవో విజయరామారావు


బొంరాస్‌పేట: ఉపాధ్యాయులకు వీడ్కోలు చెబుతున్న విద్యార్థులు



యాలాల: బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

దుద్యాల్: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు బుధవారం అందజేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి విజయరామా రావు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర సమయం వృథా చేయకుండా తరువాత తరగతికి సంబంధించిన పాఠాలు చదువుకోవాలని సూచించారు.

దౌల్తాబాద్: ఏడాదంతా పాఠ్యపుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు బుధవారం నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలలకు చివరి రోజు కావడంతో విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

యాలాల: వార్షిక పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. బుధవారం మండలంలోని ఆయా పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ చేశారు. సందర్భంగా ఒకటి నుంచి 9వతరగతి విద్యార్థులకు ఆయా తరగతుల ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. అనంతరం విద్యార్థులు సంతోషంగా, తోటి స్నేహితులకు ఉపాధ్యాయులకు పలకరించి వీడ్కోలు పలికారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన ప్రోగ్రెస్ కార్డులతో సిబ్బంది ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

కుల్కచర్ల: విద్యా సంవత్సరం చివరిరోజు పురస్కరించుకుని బుధవారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో 4వతరగతి చదువుతున్న విద్యార్థులు 7గురు గురుకులాలకు ఎంపికకావడంతో పాఠశాల నుంచి వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుప్పలి ఆనంద్‌కుమార్ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పూలమాల వేసి సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు తుప్పలి ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, దస్తయ్య, పాల్గొన్నారు.

సెలవుల్లో జాగ్రత్త : ప్రత్యేకాధికారి దేవి

ప్రస్తుత విద్యా సంవత్సరం చివరిరోజు కావడంతో కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వసతిగృహాల్లోని విద్యార్థులు స్వగ్రామాలకు తరలారు. ఈ సందర్భంగా కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇంటికి వెళ్తున్న విద్యార్థినులకు ప్రత్యేకాధికారి దేవి సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

బొంరాస్‌పేట: ఈ యేడాది విద్యా సంవత్సరం ముగిసింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు బడికి బై చెప్పేశారు. ఉదయం తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతి, పాఠశాలల్లో ఏడాది నివేదికలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

బంట్వారం: వేసవి సెలవులు వచ్చేశాయంటూ విద్యార్థులు సంబర పడ్డారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు.

దోమలో..

దోమ: సెలవుల్లో విద్యార్థులు అశ్రద్ధ వహించొద్దని మండల విద్యాధికారి వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవులు రావడంతో తల్లితండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు.

మోమిన్‌పేట: బుధవారం పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థులు హెడ్ మాస్టర్ గౌరిశంకర్‌తో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగి ఆనందం వ్యక్తం చేశారు.

పరిగి: ప్రభుత్వ పాఠశాలలను పేద విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ గోపాల్ తెలిపారు. మిట్టకొడూర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లితండ్రులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌తో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు.


కుల్కచర్ల: ఇంటికి వెళ్తున్న విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి దేవి


దౌల్తాబాద్ పాఠశాలలో తల్లిదండ్రులతో కలిసి ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలి

- ఎంఈఓలు హబీబ్‌అహ్మద్, రవీందర్
- అట్టహాసంగా చౌడాపూర్ జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం


కుల్కచర్ల: చౌడాపూర్ జెడ్పీ పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యప్రదర్శన

కుల్కచర్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల విద్యాధికారులు హబీబ్‌అహ్మద్, రవీందర్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ జెడ్పీ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు ప్రతీరోజు కొత్త అంశాన్ని నేర్చుకోవాలని, సమాజంలో జరుగుతున్న అంశాలను గ్రహించి కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుకూలంగా విద్యనభ్యసించాలన్నారు. సమాజహితమైన ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఉన్నత తరగతులకు వెళ్తున్నామంటే మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. కాబట్టి ప్రతీ విద్యార్థి కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాసంవత్సరంలో పాఠశాల పరిధిలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల వివరాలను బుక్‌లెట్ ద్వారా గ్రామస్తులకు అందజేశారు. ప్రవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధన చేపడుతున్నారన్నారు. తల్లిదండ్రులకు అందజేసిన బుక్‌లెట్‌లోని చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్హాటి అశోక్‌కుమార్, స్థానిక నాయకులు కొత్తరంగారెడ్డి, బి.వెంకటేశ్, యాదయ్య, బంధయ్య, శ్రీనివాస్, తిమ్య, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, సీఆర్పీలు రాఘవేందర్, విజయ్‌కుమార్, ఉపాధ్యాయుల బృందం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

తాండూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పెద్దేముల్ మండల ప్రత్యేకాధికారి (మైన్స్ ఏడీ) సత్యానారాయణ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దేముల్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైన్స్ ఏడీ సత్యానారాయణ మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా చేపడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు అధికంగా ఉండటంతో తల్లిదండ్రులపై ఆర్థికభారం పడుతుందన్నారు. కావున ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రతన్‌సింగ్, ఎంఈఓ నర్సింగ్‌రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విందు భోజనం

జినుగుర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం నాగప్ప ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసి అనంతరం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


తాండూరు రూరల్: ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

మోడల్ స్కూల్లో ..

జినుగుర్తి గేటు సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ శ్రీదేవి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానం చేశారు.

కేజీబీవీ హాస్టల్ నుంచి ఇంటికి..

ఐనెల్లి శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వేసవి సెలవులు ఇవ్వడంతో ప్రత్యేకాధికారిణి ఆశలత ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థినులు వారి సామగ్రిని తీసుకొని తల్లిదండ్రులతో కలిసి ఇంటిబాట పట్టారు.